# ఎవరిసన్నిధిలో నీమనస్సుకు లోచూపు కలుగుతుందో వారే నీగురువు

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 02-09-01, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి మమత, ఆసక్తి, కర్మఫలంపట్ల అపేక్ష తగ్గించుకోమని భగవంతుడు చెప్పాడు. మనం మమకారాన్ని నెమ్మదిగా తగ్గించుకొంటూరావాలి. కర్మఫలంపట్ల ఆపేక్ష ఉండకూడదు. దేహప్రారబ్దంలోఉన్నది కోరిక లేకపోయినావస్తుంది కోరికలేకుండా వచ్చినది మనలను బంధించదు, అది చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. కోరికతో తెచ్చుకొన్నది మనలను బంధిస్తుంది. మనకు ఒకేసారి పూర్ణత్వంరాదు. చిన్నచిన్నమంచిపనులు, సేవలు, సహాయాలు చేసుకొంటూవస్తే మన జీవితంలో పూర్ణత్వం వస్తుంది. కొంతజపంచేయటం, కొంతధ్యానంచేయటం, మనగురించి మనం ఆలోచించుకోవటమే కాకుండా కొద్దిటైము ఇతరులగురించి ఆలోచించటంఅంటే ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడటం ఇలాచేసుకొంటూరావాలి. ఇతరులగురించి ఆలోచించటంవలన, వారికి సహాయపడటంవలన నీ చైతన్యస్థాయి పెరుగుతుంది. శ్రద్ధలేకుండా ఆధ్యాత్మికజ్ఞానమేకాదు భౌతికజ్ఞానంకూడా కలుగదు. నీకు శ్రద్ధఎలాకలుగుతుందిఅంటే సాధుపురుషులతో సహవాసం చేయటంవలన, వారికి సేవచేయటంవలన మీకుశ్రద్ధకలుగుతుందిఅని శాస్త్రంచెపుతోంది. శ్రద్ధకలవాడి దృష్టిఅంతా సాధనమీదే ఉంటుంది. దేహం క్షణభంగురం దానిగురించి ఆలోచించి కాలాన్ని వృధాచేసుకోవద్దు. ఈరోజుఉన్నశరీరం రేపుఉండకపోవచ్చు. నీవు చిన్నచిన్నపనులుచేసినా శ్రద్ధగా చేయటంవలన నీకు జ్ఞానంకలుగుతుంది, జ్ఞానంవలన నీకుశాంతికలుగుతుంది. శ్రద్ధఉన్నవాడిని సంసారం విడిచిపెడుతుంది. శ్రద్ధవలన నీ హృదయంలోఉన్న మహావెలుగును, ఆత్మను ఎప్పుడైతే దర్శించావో అప్పుడు శాంతికోసం నీవు శరీరం మరణించేవరకు ఆగనక్కరలేదు, పరమశాంతి, నిర్వాణస్థితి శీఘ్రంగా, అతివేగంగా ఆక్షణంలోవచ్చి నిన్నువరిస్తుంది. అప్పుడువచ్చే శాంతి విషయాలమీద ఆధారపడినదికాదు, అది అలౌకికశాంతి. అది నీఇంద్రియాలకు, మనస్సుకు అందదు. దానిగురించి నీవు ఇతరులకు చెప్పాలన్నా చెప్పలేవు.

మానవుడు ఏ పరిస్థితులలోఉన్నవాడికి జ్ఞానంకలిగేవరకూ ఏదోరకమైనా దుఃఖం, అశాంతి, వెలితి వాడిని వెంటాడుతూఉంటాయి. ధనంలేనివారు ధనవంతులు అందరూ

సుఖపడుతున్నారుఅని అనుకొంటారు. అదేమాయ. ధనంవలన మోక్షంకలుగదు, శాంతిరాదు. సూదిబెజ్జంలోనుండి ఒంటెను బయటకు లాగవచ్చునేమోగాని ధనవంతుడిని స్వర్గరాజ్యంలోనికి పంపలేము అని యేసుచెప్పారు. ధనాన్నిబట్టి మంచితనం పెరగదు, మనోవికాశంరాదు, చైతన్యస్థాయిపెరగదు. మానవుడు మొదట కోరికలతోనే భగవంతుడిని ధ్యానంచేస్తాడు. ఇలా కొంతకాలంచేసాక, కొన్నికోరికలు నెరవేరినతరువాత ఈ కోరికలలో ఏమీలేదు, ఇవి నెరవేరటంవలన కలిసివచ్చేది ఏమీలేదుఅని వాడికి వివేకం కలిగి నాకు కోరికలువద్దు, నీకృపేకావాలిఅని అప్పడు దేవుడినిప్రార్థిస్తాడు. ప్రపంచంలో ధనవంతులను మనం ఐశ్వర్యవంతులుఅని అనుకొంటాముకాని ఏ కోరికలులేనివాడు అంతకంటే పెద్ద ఐశ్వర్యవంతుడు, వాడు పూర్ణకాముడు. అన్నం తినటంవలన శరీరం ఎలాపెద్దది అవుతుందో అలా సాధనచేయటంవలన భక్తిలో పెద్దవాళ్లం అవుతాము. భక్తిలో పెద్దవాడవుఅయ్యాక నాకు కోరికలువద్దు, నీకృపేకావాలి, నీ అనుగ్రహం తప్పించి నాకుఏమీ అక్కరలేదు అనేస్థాయికి ఈభక్తుడువస్తాడు. భగవంతుడు అందరి హృదయాలలోఉన్నాడు. భగవంతుడులేని హృదయంలేదు కాని అందరి హృదయాలలో వ్యక్తంకాడు. ఎవరి హృదయంఅయితే పరిశుద్ధమయ్యిందో, పవిత్రతతో నిండిఉందో వాడిహృదయంలో భగవంతుడు వ్యక్తమవుతాడు. వాడినే ఋషి, యోగి అంటాము, నీకుఉన్న దేహబుద్ధిని ఎండింపచేయటమే తపస్సు. అలా తపస్సుచేస్తూఉంటే మనస్సు క్రమేపి పవిత్రంఅవుతుంది. అప్పడు భగవంతుడికృప రూపం దాల్చుతుంది. వాడేగురువు భగవంతుడిలోఉన్నదయే గురువుగావస్తుంది. అలా గురువుగావచ్చి భక్తుడికి జ్ఞానంగురించి, ఆత్మగురించి బోధిస్తాడు. అలా బోధించి నీ మనస్సును నిర్మలంచేస్తాడు, ఏకాగ్రంచేస్తాడు, సూక్ష్మంచేస్తాడు. నీ హృదయంలోఉన్న వస్తువును పట్టుకోవటానికి నీకు యోగ్యతను కలుగజేస్తాడు.

నా మనస్సు బాగాలేదు, నామనస్సు బాగాలేదు అని చాలామంది చెపుతూఉంటారు. దీనికి భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే ఆ మనస్సువు నీవుకాదుకదా అది బాగాలేకపోతే నీకు ఎందుకు అంటున్నారు. నీ మనస్సు బాగాలేదుఅంటున్నావు. అదినీవుకాదు కదా. అది నీవుఅయితే కంగరుపడవచ్చు. అది నీవుకాదు. నీవుకానిది నీవుఅనుకొన్నా అదినీవుఅవ్వవు. ఇది మీకు అర్థంఅవ్వాలి. నీ ఇష్టాలు, అయిష్టాలు, ఉద్రేకాలు ఇవిఅన్నీ మనస్సులోఉన్నాయి. ఉంటేఉండనియ్యి అదినువ్వుకాదు. మనస్సు నీవుఅయితే గాఢనిద్రలోకూడా మనస్సు నిన్ను విడిచిపెట్టకూడదు. కాని గాఢనిద్రలో నీకు మనస్సు గొడవలేదుఅంటే అది నీవుకాదు.

శరీరధర్మాలను, మనస్సులోఉన్న గుణాలను నీమీద ఆరోపించుకొంటున్నావు. ఈ ఆరోపించుకోవటం లేకపోతే నీకు పుట్టుకలేదు, మరణంలేదు. కొంతమందికి ఎంతకాలం జీవించినా వారికి మానసికజీవితంఉండదు. మానసికజీవితం లేనివాడికి ఆధ్యాత్మిక జీవితంలో అడుగుపెట్టే అవకాశంలేదు. ఎంతోకొంత మానసికజీవితంఉండాలి. మనం గురువును ఎన్నుకోవటంవేరు, గురువు మనలను ఎన్నుకోవటంవేరు. గురువును మనం ఎన్నుకొంటే ఆ గురువును మార్చేయగలము. గురువే మనలను ఎన్నుకొన్నప్పుడు ఆ గురువునుండి మనం విడుదలపొందలేము, గురువుతో అనుబంధం తెంచుకోలేము. గురువుతో ఎన్నుకోబడ్డ జీవుడు తరించబడే తీరుతాడుకాని వాడు తప్పుకొనే అవకాశంలేదు. నీకు మానసిక జీవితంఉంటే గురువు చెప్పినమాటలను లోపలకు తీసుకొంటావు, గురువుచెప్పినట్లు సాధనచేస్తావు, లోపలపవిత్రంఅవుతావు, అప్పుడు నీకు జ్ఞానంకలుగుతుంది, శాంతి కలుగుతుంది. గురువు నీతో ఏదో లోకవిషయాలు, కుటుంబవిషయాలు మాట్లాడుతూఉంటాడు. వాటికి జ్ఞానానికి ఏమీసంబంధంలేదు. నిన్ను ఎక్కడికి తీసుకొనివెళ్ళాలో దానికి ప్రిపేర్‌చేయటానికి నీతో అలామాట్లాడుతూ నిన్ను సన్నిహితం చేసుకొంటాడు. అదిగ్రహించినవాడు ధన్యుడు. ఆత్మానుభవం పొందటానికి నీకు ఏవైతే అడ్డువస్తున్నాయో గురువు చూస్తూఉంటాడు. వాటిని తొలగించుకోవటానికి నీకు శక్తిని ప్రసాదించి వాటిని తొలగింపచేస్తాడు. నీలోఉన్నదోషం గుర్తించి దానిని నీకుచూపిస్తాడు, దానిని తొలగించుకోవటానికి నీకు ఉపాయంచెపుతాడు, దానినుండి విడుదల అవ్వటానికి శక్తినిఇస్తాడు, నీచేత వాటిని తొలగింపచేయటానికి చూస్తాడు. ఒకవేళ ఈజన్మలోనీవు దానిలోనుండి బయటకురాలేకపోతే నీకూడాఉండి రాబోయే జన్మలలో ఆపనిపూర్తిచేస్తాడు. వాడుగురువు. గురువు ఏదిచేసినా మనమంచికే చేస్తున్నాడుఅని మానసిక జీవితం ఉన్నవాడు గుర్తిస్తాడు, మానసిక జీవితం లేనివాడు దానిని గుర్తించలేడు.

పుణ్యంవలన మంచిజన్మలు, పాపంవలన చెడుజన్మలురావచ్చు. పుణ్యంమిగిలిన ప్రమాదమే, పాపంమిగిలిన ప్రమాదమే. అగ్ని వస్తువులను ఎలాదహిస్తుందో అలాగ నీవు నిష్కామంగా పనిచేస్తూఉంటే, ఆత్మజ్ఞానంతో పనిచేస్తూఉంటే నీలోఉన్న పుణ్యపాపములను, పునర్జన్మ కారణములను నిశ్శేషంగా జ్ఞానాగ్ని దహించేస్తుంది. ప్రతీగొప్పవాడు మంచివాడు అవ్వనక్కరలేదు. ప్రతీ మంచివాడు గొప్పవాడు అవ్వనక్కరలేదు. గొప్పతనం ఆత్మజ్ఞానానికి

దారిచూపించదుగాని మంచితనం ఆత్మజ్ఞానానికి దారిచూపిస్తుంది. మీ అనుగ్రహం మాకులేదుఅని భగవాన్‌తో కొంతమంది అనేవారు. నా అనుగ్రహం నిజంగాలేదుఅనుకో ఇక్కడికి ఎందుకువస్తావు అన్నారు భగవాన్. నీ తెలివితేటలవలన ఇక్కడకువచ్చాను అనుకొంటున్నావు. నీ తెలివితేటలవలన రాలేదు, నా అనుగ్రహమే నిన్ను తీసుకొనివచ్చింది. భగవాన్ దగ్గరకు వెళ్లటం ఎందుకంటే మనం ఆయనను చూడటంకాదు, ఆయనచేత చూడబడటం ముఖ్యం. మన కళ్లలో ఏమైనా శాంతిఉందా? జ్ఞానంఉందా? ఈ మాంసపునేత్రాలు ఏమిచూస్తాయి. ఆయన కళ్లలో ఎంతోజ్ఞానంఉంటుంది, శాంతిఉంటుంది, దయఉంటుంది. ఎందుచేతనంటే ఆత్మేకాళ్ళుచేతులు తొడుక్కొని అక్కడఉంటుంది. ఎవరిని గురువుగా ఎంచుకోమంటారుఅంటే ఎవరిసమక్షంలో నీకు శాంతికలుగుతోందో, ఎవరిసమక్షంలో నీకు జ్ఞానంసంపాదించాలిఅనే అపేక్ష కలుగుతోందో, ఎవరిసమక్షంలో నీ మనస్సుకు లోచూపు కలుగుతోందో వారినే నీగురువుగా ఎంచుకో. నీ బాధ్యతలు, భారాలను పెంచేవాడు గురువుకాదు. నీ బాధ్యతలనుండి, భారాలనుండి నిన్ను విడుదలచేసేవాడే గురువు. నిన్ను చీకటిలోనుండి వెలుగులోనికి తీసుకొనివచ్చేవాడే గురువు. నీవు ఏవిధంగా జీవిస్తే నీకు భగవదనుభవం కలుగుతుందో అది నీకు బోధించటమేకాదు, అలా ప్రాక్టీసుచేయటానికి, ఆరకంగా జీవించటానికి నీకు శక్తినిఇచ్చి, గమ్యానికి చేరటానికి నీకు సహాయసహకారములు అందించేవాడే గురువు. గురువుకు పనిఅంటూఏమీలేదు నీవు పూర్వజన్మలనుండి చేసిన పూజలకు ఫలితంగా భగవంతుడే గురురూపంలో వస్తాడు.

**గాఢనిద్రలో ఉన్నసుఖమును మనం జాగ్రదవస్థలో ఎఱుకతో అనుభవించాలి. అదే సమాధిస్థితి**